# తావరం

నా చిన్నప్పుడు మా యక్కయితే- యింట్లో ఉంటిందిగదా ఈగె? దాన్ని గూడా నామింద అట్టా వాలనిచ్చేది గాదు.

''వాడి మొకం''. వాణ్ణా నాలుగ్గాళ్ళమండపం దగ్గిర యిడ్సి పెట్తే యాదోవ ఎట్టబోతిందో ఎరగని పిల్లయదవ. అంతకూ యింతకూ వాడి మిందట్టా యిర్సకపడ్తే ఎట్లా?'' అంటా నన్ను ఎనకేసుకోని వచ్చేది.

ఆమెకు బిడ్డల్లేరు. అందుకేనేమో నేనంటే శానా ముదిగారం. ఆ ముదిగారం చూస్తే మాబావకు ముక్కులో ఎంటిక పెరికి నట్టుండేది.

''ముదిగారం కుక్క మూతులు నాకి నట్టుండాదే యవ్వారం. నీ తమ్ముణ్ణిగాన ఆ నాలుగ్గాళ్లమండపం కాడ యిడ్సి పెట్టేస్తే వాడు యింటికి రాలేడు. నిన్నా పీర్ల చావిడి కాడ యిడ్సి పెట్టేస్తే నీకు తూరుపు పరంటా రొండూ తెల్డు. ఇద్దూరూ నోట్లో ఏలుపెట్తే గూడా కొరక లేర్లే?'' అంటా యిస్సణ్ణం పడేవాడు మాయక్క మొగుడు- అదే మాబావ. మాటకు మాటంటే ఆ మణిసి ఈడెగిరి అడ పాయ్ పడ్తాడని మాయక్క మింగలేక కక్కలేక మినకరిచ్చేదే కాని నోరిచ్చేది గాదు.

ఎట్టయినా పాతకాలం మణిసిగదా ?

నాలుగ్గాళ్లమండపం కాడ యిడ్సిపెట్తే రాలేడంటే అది ఆడయాణ్ణో చీమలు దూరని చిట్టడివి కాకులు దూరని కారడవి లోనో ఉండాదనుకునేరు. అదేంగాదు. నట్టనడూళ్లోనే. అయిద్రాబాద్‌లో అబిడ్స్ మాదిర చెన్నపట్నాన సెంట్రల్‌టేసిన్ మాదిర నాలుగుదోవలు కలిసేచోట్నే కుదురుగా ఉండాది.

ఇప్పుడంటే తిరపతి ఒక వగాతగా లేకుండా చింపిరితల పెరిగినట్టు పెరిగి పొయ్యుండాది గానీ ఒకప్పుడు ఎట్టుండె? ఈ కొల్లబొయ్న గుంపు యాడుండ్రి. ఈ రంపూరచ్చ యాడుండె? అప్పుడు సద్దూసడీ లేకుండా బుట్టిలో పాము! ఇప్పుడంటారా?

పడిగెత్తిన పాము! అప్పుడు నిమ్మతిగా నాలుగుదినాలు ఉండాలనిపిస్తా ఉండె. ఇప్పుడు ఎప్పుడెప్పుడు ఉమ్ములు తెంపుకొని పరిగిద్దాంరా నాసామీ! అనిపిస్తా ఉండాది.

అప్పుడు నాలుగ్గాళ్లమండపం ఉణ్ణిందియాడ? నట్టనడూళ్లోనేగదా!

'' ఒరె వొరె! నువ్వు చెప్పేది శానా యిచ్చిత్రంగా ఉండాదే? మీ ఊళ్లో ఆ కొండమింద ఉండాడే కొండంత దేముడు! ఆ దేముణ్ణి కొల్సుకుందామని నెలకొకసారి వస్తా వుండాం. ఆరు నెల్లకొకసారి ఆలూబిడ్డల్తో వస్తావుండాం. యాడాదికొకసారి యిల్లు తీర్తం యిచ్చే దానికని యిల్లిల్లుగా ఎలబారి వస్తావుండాం. యాడా? ఆ నాలుగ్గాళ్లమండపం కంట్లో పడక పోతే పొయ్యింది. చెవల్లో గూడా పల్లేదే?'' అంటారేమో?

మీరు అనాల్సిన మాటే! నేనుగూడా యినాల్సిన మాటే!

అయితే ఒకమాట. మీకు తెల్సునో తెల్దోగానీ తిరమలకొండమింద వెయ్యిగాళ్లమండపం ఉండాది. చిన్నప్పుడు నేనా మండపంలో ఒంటిమింద ఒకనూలుపోగు కూడా లేకుండా గోలీకాయిలాడుకుండే వాణ్ణి!

''నువ్వు ఉణ్ణింది యాడ? ఉళ్లేసేది యాడ? కోతలు కోసినా దానికీ ఒకమితం ఉండాలగదా? పుట్టి పెరిగింది యాడ? గోలీకాయిలాడు కుణ్ణింది యాడ?'' అంటా లగుసుకుంటారేమో-

ఇప్పటికీ మా పెద్దక్కను కొండామె అంటారు. ఆమె మొగుడు కొలువు కొల్సింది కొండమింద. లీవులొస్తే కొండమిందికిపాయ్ నేను ఉణ్ణింది వాళ్ల చేతలకింద.

అప్పుడు వెయ్యిగాళ్లమండపంలో గోలీకాయిలాడుకుంటా ఉంటే దేవుడి దర్శినం చేసుకోని అందురు ఆడికి వచ్చే వాళ్లు. వెయ్యిగాళ్లమండపాన్ని వెయ్యి కండ్లతో చూసేవాళ్లు! 'ఓయబ్బా! ఎయ్యిగాళ్లా?' అంటా ముక్కుమింద ఏలేసుకునేవాళ్లు. కొందురైతే అదేపనిగా లెక్క పెట్టేవాళ్లు!

'' ఆ కొండల్లో కోనల్లో ఆ చుట్టుపక్కలా ఎతికి నా యాడా అటుమంటిరాయి దొరికే బండలే లేవే? ఏడేడుకొండలు దాటి ఎయ్యిస్తంబాలు ఈడికి ఎట్లొచ్చినాయబ్బా? వచ్చినా ఒక్కొక్క స్తంబాన్ని మల్సేదానికి ఎన్నిదినాలు పట్నాయో? ఎంతమంది పనిచేసినారో? ఆకాలాన కాబట్టి సరిపొయ్యింది. ఈ కాలానైతే యిది అయ్యేపనేనా?'' అంటా ఒకర్తొకరు తలపోసుకునేవాళ్లు.

అటువంటి మండపం ఎట్లపొయ్యిందో ఉరువులేకుండా పొయ్యింది. వెయ్యిదోవలై పొయ్యింది. ఎంతో అపురూపంగా చూసుకోవాల్సినకట్టడమే ఆరూమూడై పాయ. సరేలే? ఆడికి యాడస్తా ఉండాది మన యింగితగ్నానం. ఇంక బెంగుళూరు పేరే యిన్నోడు పుంగునూరు పేరు యాడ యినుండ బోతాళ్లే అన్నెట్టుగా వెయ్యిగాళ్లమండపం పేరే తెల్నోడికి నాలుగ్గాళ్లమండపం అంటే యాడ తెలిస్తిందిలే?

తిరపతి అంటేనే నిత్తెకల్లాణం పచ్చతోరణంగదా? యాత్రకని ఎలబార్తే బస్సుల్లో

వచ్చేవాళ్లు వస్తా ఉండారు. రైళ్లల్లో వచ్చే వాళ్లు వస్తా ఉండారు. బస్సుల్లో వచ్చేవాళ్లు బైపాస్ రోడ్డు మిందపోతే రైల్‌టేసిన్లో దిగినోళ్లు మాత్రం టేసిన్ బయటికొస్తారా? వచ్చి కొత్తసత్రానికి పోవాలనుకునేవాళ్లా... కొండబస్సు ఎక్కాలనుకునేవాళ్లా కుడిచేతిపక్కకు అంటే తూరుపుగా దిగబడిపోతారు. ఊళ్లోకి పోవాలనుకునేవాళ్లు మాత్రం పరంటగా ఎగబడిపోతారు. ఎగబడి ఎంచినట్లు ఏడడుగులేసి ఆడ కుడితట్టుకు తిరగతారు. తిరగతానే ఉత్తరంగా పోతా ఒకరోడ్డు కనిపిస్తింది. ఆ రోడ్డు కంట్లో పడకముండే ఆరోడ్డుమింద పులగుండు మాదిర్తో నిలబడుకోనుండే ఒక తేరు కనిపిస్తింది. అదే గోయిందరాజసామి తేరు. గోయిందరాజసామి తేరుండాది కాబట్టే ఆ ఈదిగ్గూడా అదే పేరు వచ్చింది. తెల్లోడి వైబావం మనమింద యింకా పోలేదని చెప్పుకునేదానికి గోయిందరాజసామితేరు వీది 'జీకార్ స్ట్రీట్' అయింది.

దిక్కులు చూసుకుంటా ఆ ఈదిమిందట్లా నడ్సువస్తా ఉంటే ఆడొకపెద్ద ఓటల్ కనిపిస్తింది. దాన్ని అట్లా దాటుకుంటానే టేసిన్ కాడికి కనిపించిన తేరు ఉంటింది. ఆడ ఆ తేరు ముందర వద్దనుకుణ్ణా ఒకవక్క కొరికినంత సేపు నిలబడ్తారా? నిలబడి తలపైకెత్తి చూస్తారా? చూస్తా 'ఓ యబ్బా! శానా పెద్దదే' అని పొగడ్తారా? పొగడ్తానే రొండు చేతులెత్తి దణ్ణం పెడ్తారా? దణ్ణం పెట్టా అనుకోనట్టుగా తలకాయట్లా పక్కకుతిప్పితే అంతకన్నా శానాఎత్తుగా కనిపిస్తింది ఒక గోపరం!

అదే గోయిందరాజులగుడి గోపరం!

గోయిందరాజులంటే ఎవురనుకుణ్ణారు? సాచ్చాత్తు ఏడుకొండల మింద ఉండే వెంకటేశ్వరుడికే అన్న! ఈయన ఎంగిలి పాలు ఆయన తాగినా ఆయన వైబోగం ఈయన కేడుండాది లే? సరే! అన్న బతుకు అన్నది. తమ్ముడి బతుకు తమ్ముడిది. దేవుళ్లకతలే ఆడికుంటే యింక మనకతలా? ఎందుకులే? రగతం పంచుకోని పుట్నా రగతం కండ్ల చూసే దానికే ఎర్సేదే లే!

అన్నెట్లు యిప్పుడు మనం ఎక్కడ నిలబడుకోనుండేది? తేరుకాడ కదా?

బంగాళా ముందర కారుంటే బంగాళాకు మతింపు!

గుడిముందర తేరుంటే గుడికి మతింపు!!

ఆ గుళ్లోనే గోయిందరాజసామి పొణుకోని ఉండేది.

దేవుళ్లందురూ అయ్యోరి ముందర తప్పుచేసిన పిలకాయిల మాదిర నిలబడుకోనుంటే ఈ దేవుడు మాత్రం సుద్దంగా కాళ్లు చాపేసి పొణుకోనుండాడు. అదెందుకట్లా? అంటే కొడుకు చేసిన శాతలకు అబ్బ బందేరాకు మోసినట్టు! కొండ మింద లచ్చిణంగా కొలువు దీరి రేత్రింబొగుళ్లు రొండుచేతుల్తో జవిరింది జవిరిందిగానే ఉండే ఆ తమ్ముడు వచ్చేది చాలకుండా అప్పుచేసినాడంట! ఆ యప్ప చేసిన అప్పు తీర్చేదానికి అన్న కుంచంతో రూకలు కొల్సికొల్సి అల్సిపుల్సిపాయ్ ఆకుంచాన్నే తలకిందట్లా పెట్టుకోని

పడకేసినాడంట!

అప్పుచేసే నోకం తెల్సి నోడికి వెండి తేరు!

దాన్ని తీర్సాలనుకునే వాడికి కొయ్యతేరు!!

బగుమంతుల్ల కతే ఆడికి తెల్లారింది. బాగుండ్లా?

కుంచం తలకింద పెట్టకోని పాణుకుణ్ణె మహన్నబావుడు ఎంతసేపని పాణుకుంటాళ్లే? కుశాలగా లేచినపుడు వాహనాల మిందెక్కి కులికినా యాడాది కొకసారి మాత్రం తేరెక్కతాడు. నాలుగు ఈదులగుండా ఊరేగతాడు.

మంత్రి ఊళ్లోకి వస్తా ఉండాడని తెల్సిందనుకోండి. ఇట్టా ఊళ్లోవాళ్లకు అట్టా ఉద్దోగస్తులకు ఒంటిమింద గుడ్డ నిలవదు. నిల్సినచోట కాలునిలవదు. నిన్నుపట్టి నన్నుపట్టంటా పారా గెడ్డపార శాతపట్టుకుంటారు. మిట్టమింద అంత మట్టిదీసి పల్లానికేసి చదరకట్తారు. పల్చంగా నీళ్లు చిలకరిస్తారు. ఇంక బేనర్ల కతలంటేనా? చెప్పాల్సిన పనేలే. అట్టా మాదిర ఈ మొగలాయి అదే గోయిందరాజసామి తేరెక్కినాడంటే ఆర్నెల్లు ఈది మొకం చూడని ఆడదైనా సరే యింటిముందర చిక్కంగా కళ్లాపులుచల్లి ఆ ఈదే పట్నంత ముగ్గులేస్తింది!!

ఊళ్లో అడుగు పెట్టి యాడేడ బేనర్లు కట్నారు? ఎంతెంత పెద్దవి కట్నారు? ఎన్నెన్ని కట్నారు? ఎవురెవురు కట్నారు? అని ఎంచుకుండే మంత్రి ఏమనుకుంటాడో ఏమోగానీ-యింటి ముందరే యింతింత ముగ్గులు పోస్తే యింక యిండ్లల్లో ఏకంగా ముత్తేల ముగ్గులే పోసుకోనుంటారని తలపోసి నవ్వతా నాలుగీదులు తిరిగేసి ఎలబార్నె చోటికే చేరి తేరుదిగి పాయ్ పాణుకుంటాడు ఆసామి! గోయిందరాజసామి!!!

ఊరెట్టన్నా పోనీ మల్లా యాడాదికే లేచి ఊరేగేది..

ఆతేరు దాటుకోని ఉత్తరంగా పదిబారలట్టా పోతే ఆణ్ణే నాలుగుదోవలు కల్సేది. ఆ నాలుగుదోవలు కల్సేచోట్నే నాలుగ్గాళ్లమండపం ఉండేది.

నాలుగ్గాళ్లమండపం ఉండాదని నాలుగుదోవలు ఏర్పణ్ణాయో? నాలుగు దోవలు కల్సేచోటని నాలుగ్గాళ్ళమండపమే కట్నారో తెల్దుగానీ ఊరు పుట్టినప్పిటి నుంచి నాలుగ్గాళ్లమండపం మాత్రం ఉండాది. ఈ నాలుగ్గాళ్లమండపానికి ఎదురుగానే గ్రామచావిడి ఉండేది. గ్రామచావిడి కాడంటే ఊళ్లో ఎవుడికి తెల్దుకానీ నాలుగ్గాళ్లమండపం కాడంటే ఒక మాదిరిగా వగ తెల్సినోడు కూడా వోల్‌రైట్‌గా తెల్సునంటాడు. ఊళ్లో యాడికెట్లా పోవాల్నో ఎరగని ఎర్రోణ్ణి గూడా నాలుగ్గాళ్లమండపం తెల్దా? అని అడిగితే అడిగినోణ్ణే ఎర్రోడనుకుంటాడు. ఆణ్ణుంచి దోవచెప్తే అలాగ్గా అందుకుంటాడు!!

ఆ తావరమే దాని కొక వరం!

అదీ నాలుగ్గాళ్లమండపం!! ●